# స్వీట్ హోమ్

[3 భాగాలూ కలిసిన సంపుటం]



రంగనాయకమ్మ

# స్వీట్ హోమ్

[3 భాగాలూ కలిసిన సంపుటం]

రంగనాయకమ్మ

**స్వీట్ హోమ్ పబ్లికేషన్స్**
76, లేక్-సైడ్ కాలనీ
జూబ్లీ హిల్స్ పోస్టు
**హైదరాబాదు - 500 033**

స్వీట్ హోమ్
[నవల]

పేజీలు : 452
[ రాయల్ సైజులో,
హార్డ్ బౌండ్‌తో ]

రచనా కాలం :
1వ భాగం - 1967
2వ భాగం - 1968
3వ భాగం - 1999

ధర : **140 రూ.లు**

ఈ సంపుటానికి,
1వ ముద్రణ : 2004 నవంబరు
2వ ముద్రణ : 2006 ఆగస్టు
3వ ముద్రణ : 2008 మార్చి

3 భాగాలూ కలిసిన సంపుటానికి:
1, 2 భాగాల కంపోజింగ్: **ఎన్.ధనలక్ష్మి**
3వ భాగం కంపోజింగ్: **ఎమ్.శారద**

పేజ్ మేకప్ : **ఎన్.రఘురామయ్య**

ముందు అట్ట మీద బొమ్మ : **బాపు**
వెనక అట్ట మీద బొమ్మ : **కరుణాకర్**

ముద్రణ:
**చరితా ఇంప్రెషన్స్**
1-9-1126/బి
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా
హైదరాబాదు - 500 020

ప్రతులకు:
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు
**విజయవాడ - 520 002.**
(ఫోన్: 0866 - 2431181)

**రంగనాయకమ్మ అడ్రసు:**
76, లేక్-సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# ముందు మాట

**ఈ** నవల, 3 భాగాలుగా ఉంది. కానీ, ఇది రాయడం మొదలు పెట్టినప్పుడు ఇన్ని భాగాలూ, ఇంత కథా నా దృష్టిలో లేవు.

విమలా బుచ్చిబాబుల పాత్రలతో మొట్టమొదట **'పాదాల చెంత చోటు'** అనే పేరుతో ఒక చిన్న కథ రాశాను. అది ఒక మాసపత్రికలో వచ్చిందిగానీ ఆ పత్రిక పేరు గుర్తు లేదు. తర్వాత, ఆ కథే కొంచెం పెరిగి **'స్వీట్ హోమ్'**గా అయింది.

'స్వీట్ హోమ్' మొదటి భాగం రాసింది, 1967లో. రెండో భాగం, 68లో. మూడో భాగం — 99లో! మొదటి భాగానికీ మూడో భాగానికీ మధ్య దూరం, 32 సంవత్సరాలు!

మూడో భాగం రాసినప్పుడు, 1, 2 భాగాలు చదవలేదు. ఆ పాత్రల స్వభావాలు గుర్తు వుండడం తప్ప, ఆ వెనకటి భాగాల్లో వున్న సంఘటనలు ఎక్కువగా గుర్తు లేవు.

1996లో, 1, 2 భాగాలు కలిసి ఒకే సంపుటం అయ్యాయి. ఇప్పుడు, 2004లో, 3 భాగాలూ కలిసి ఒకే సంపుటం అవుతున్నాయి. ఇక నించీ ఈ సంపుటమే రీ ప్రింటు అవుతూ వుంటుంది.

నా పుస్తకాల్ని రీ ప్రింటు సమయాల్లో మళ్ళీ చదివినప్పుడు, చాలా పుస్తకాలు ఎంతో కొంత అసంతృప్తి కలిగిస్తూనే వచ్చాయి. వాటిలో ఇక్కడా అక్కడా దిద్దుళ్ళూ సర్దుళ్ళూ చేస్తూనే వచ్చాను. ఈ పని వెనకటి పుస్తకాల్లోనే ఎక్కువగా జరిగింది.

'స్వీట్ హోమ్' మూడు భాగాల్నీ ఒకే సంపుటంగా చేసే ఈ సందర్భంలో, మొదటి భాగాన్ని ఇప్పుడు చదివితే, అందులో కొన్ని చోట్ల గతంలో కన్నా ఎక్కువ అసంతృప్తి కలిగింది. ఒకటి రెండు సందర్భాల్లో అయితే, 'ఈ భాగాన్ని రీ ప్రింటు లేకుండా ఆపి వేద్దామా' అనే ఆలోచన కూడా సాగింది కొన్ని రోజులు. కానీ, ఇది, ఎంతో మంది ఆడవాళ్ళకూ, కొందరు మగవాళ్ళకు కూడా ఎంతో నచ్చిన కథ. విమలలాంటి భార్యనీ, బుచ్చిబాబు లాంటి భర్తనీ కోరుకున్న పాఠకులు నాకు తెలుసు. మొదటి భాగం వచ్చిన రోజుల్లోనే కాదు, ఇప్పటికీ ఆ భాగాన్ని చదివే పాఠకులు ఆ పాత్రల్ని చూసి చాలా సంతోష పడుతూ వుంటారు. అదంతా గుర్తు తెచ్చుకుంటే, దీన్ని రీ ప్రింటు నించి తీసి వెయ్యడం కాదు గానీ, దీన్ని గతం కన్నా ఎక్కువగా విమర్శ ముందు నిలబెట్టాలి — అనే అభిప్రాయానికి రావలసి వచ్చింది.

1, 2 భాగాల్లో వున్న లోపాలేమిటో ఆ భాగాలకు చివర్లలో రాశాను. 3వ భాగానికి అలాంటి అవసరం కలగలేదు.

3 భాగాలూ వేరు వేరు కాలాల్లో రాసినవి కావడం వల్ల ఒక భాగంలో వచ్చిన సంఘటనలే ఇంకో భాగంలో రావడం కొన్ని చోట్ల జరిగింది. అలాంటి సంఘటనల్ని ఒక చోట వుంచి, ఇంకో చోట తీసేశాను. తీసి వెయ్యడానికి సాధ్యం కాని వాటిని అలాగే వుంచాను.

విమలా బుచ్చిబాబులకు మొదటి భాగంలో ఇద్దరు చిన్న పిల్లలు వుంటారు. వాళ్ళు స్కూలుకి పోయి చదువుకునేటంత ఎదిగిన పిల్లలై వుంటారు. కానీ, మూడో భాగంలో మళ్ళీ చంటిపిల్లలు వుంటారు. దీన్ని ఎలా తీసుకోవాలంటే, 3 భాగాల్లోనూ పాత్రలు ఒకటే అయినా, ఈ భాగాల్ని వేరు వేరు కథలుగానే తీసుకోవాలి. ఈ భాగాలు, ఒకే పెద్ద కథలో వున్న వరస భాగాలు కావు. 3 భాగాల్లోనూ వున్న కథ అంతా కలిసి ఒకే పెద్ద కథ కాదు.

'జానకి విముక్తి'ని చూడండి. అది కూడా 3 భాగాలే. కానీ, అదంతా ఒకే పెద్ద కథ. ఆ భాగాలు, ఒకే కథలో వరస భాగాలు. మొదటి భాగంలో ప్రారంభమైన కథ, మూడో భాగంతో ముగుస్తుంది.

కానీ, **'స్వీట్ హోమ్'** విషయం అది కాదు. ఈ భాగాలు, ఒకే పెద్ద కథలో వరస భాగాలు కావు. ఇవి, వేరు వేరు కథల లాంటివి. అందుకే, మొదటి భాగంలో పిల్లలు పెద్ద వాళ్ళయినా, మూడో భాగంలో మళ్ళీ చంటిపిల్లలే వున్నారు.

అలాగే, విమలా బుచ్చిబాబులకు పరిచయం అయిన సందర్భాల గురించి మొదటి భాగంలోనూ వుంది, మూడో భాగంలోనూ వుంది. కానీ, చాలా తేడాగా.

చిన్న పిల్ల పేరు — మొదటి భాగంలో 'పాప'. రెండో భాగంలో 'కవిత.' మూడో భాగంలో 'పాపాయి'. — మూడో భాగం రాసినప్పుడు, వెనకటి భాగాల్లో పేర్లు గుర్తే లేవు.

ఈ సంపుటంలో వున్న 1, 2 భాగాల్ని అక్కడక్కడా తగ్గించాను. ఇది, పేజీలు తగ్గించడం కోసం కాదు. కథలో రిపిటీషన్లు తీసి వెయ్యడానికి గానీ, కొన్ని సర్దుళ్ళూ దిద్దుళ్ళూ చెయ్యడానికి గానీ, ఈ మార్పులు అవసరమయ్యాయి. ఈ 1, 2 భాగాల్ని వీటి గత ముద్రణలతో పోల్చి చూస్తే, అక్కడక్కడా చాలా తేడాలు కనపడతాయి. ఈ వివరాలన్నీ ఆ భాగాల చివర్లలో రాశాను.

**5-10-2004**

# స్వీట్ హోమ్-1

అప్సరసలాంటి అమ్మాయి విహరిస్తోంది, సముద్రతీరంలో. గంధర్వుడి లాంటి అబ్బాయి కూడా రాగ హృదయంతో ముచ్చట్లాడుతున్నాడు. పల్చని వెన్నెల! కెరటాల పాట! విశాలమైన ఇసుక తిన్నెలు!

అబ్బాయి అడిగాడు — "మనం పెళ్ళిచేసు కుందామా?"

అమ్మాయి అంది — "ఒక్క మాట. మన పెళ్ళి అయ్యాక నీ మీద హక్కులన్నీ నావే. నేనేం చేసినా నువ్వు ఊరుకోవాలి. ఇది షరతే అనుకో! అలా అయితే నాకేం అభ్యంతరం లేదు."

"ఎందుకీ సందేహం ప్రియా? నేను నీకు దాసుణ్ణి! దాసానుదాసుణ్ణి!"

"ఇప్పుడిలాగే అంటావు. నా మాట మీరితే మాత్రం నీ దగ్గర వుండను. నా దారి నేను చూసు కుంటాను."

"ఎన్ని జన్మలెత్తినా నీ దారీ, నా దారీ ఒకటే. నీ కనుసన్నల్లో బతుకుతాను. నీ అడుగుజాడల్లో నడు స్తాను."

"పిచ్చివాడా! నే నంత మూర్ఖురాలినా?" సుతా రంగా నవ్వింది అమ్మాయి— అందంగా, ఆనందంగా!

పెళ్ళయింది.

ఆ రాత్రి.

అబ్బాయి సిగరెట్టు వెలిగించబోయాడు.

అమ్మాయి అది అందుకుని కిటికీలోంచి బయ టకి విసిరేసింది — "ఈ క్షణం నించీ నువ్వు సిగరెట్టు కాల్చకూడదు. పేకాడకూడదు. కాఫీ, టీలు తాగ కూడదు. అర్ధరాత్రుళ్ళ వరకూ రోడ్లు కొలవకూడదు."

అబ్బాయికి మతి పోయింది. "అసలు చెయ్యా ల్సిందేమైనా వుందా? అదేమిటో చెప్పు" అన్నాడు అసహనంగా.

"ఇలా కోపం తెచ్చుకోకూడదు. అలా ఎర్రగా చూడకూడదు."

"అరే! చెయ్యకూడనివి ఎందుకు చెప్తావ్?"

అమ్మాయి ఒక్క క్షణం ఆలోచించింది. వయ్యా రంగా నడుస్తూ వచ్చి అబ్బాయి చెయ్యి పట్టుకుంది. "మాట్లాడకుండా రా! మాట్లాడుకుందాం" అంది.

అబ్బాయి కలలోలాగ నడిచాడు. పూల పాన్పు మీద కూర్చున్నాడు.

అమ్మాయి వయ్యారంగా అబ్బాయి ఒడిలోకి ఒరిగి పడుకుంది. "చూడు! ఇలా చూడు! మనం ఎప్పుడూ ఇలాగే వుండాలి. తెలిసిందా?" అంది చిలిపిగా నవ్వుతూ.

"అలాగే. నీ ఇష్టం" అమ్మాయి కళ్ళలోకి మత్తుగా చూస్తూ ఊఁకొట్టాడు అబ్బాయి.

గాఢంగా నిట్టూర్చింది విమల.

ఇప్పుడెన్ని ఊహలల్లుకుంటే ఏం లాభం? ఎన్ని ఉపాయాలు తోస్తే ఏం ప్రయోజనం? కాలం తిరిగి రాదు. ఒక్క నిమిషమా, ఒక్క గంటా? మూడు సంవత్స రాలు! అలా గడిచిపోతూనే వుంది కాలం. బుచ్చిబాబు తనని పెళ్ళి మాట అడిగినప్పుడు తను నిర్మొహ మాటంగా, ఖచ్చితంగా, అలాంటి షరతు పెట్టి వుంటే, ఇప్పుడిలాంటి సమస్యలెందుకొస్తాయి? అతగాడలా కొరకరాని కొయ్యలా ఎందుకవుతాడు? .... హు! అప్ప డింత మంచి ఆలోచన రాలేదు. అసలు మాట్లాడ టానికే సిగ్గు ముంచుకొచ్చింది.

బుచ్చిబాబు, విమల్ని అలాగే అడిగాడు ఇంచు మించుగా — "మీ అన్నయ్య .... పెళ్ళిమాట నీతో చెప్పాడా? .... నీ కిష్టమేనా?" అన్నాడు.

విమల ఆశ్చర్యపోయింది, అతగాడంత సాహ సించినందుకు.

అసలు బుచ్చి, ఒక ఆడ పిల్లని.... అందులోనూ మాటల పుట్టలాంటి విమలని, పెళ్ళి మాట అడిగా డంటే, సాహసం కాకపోతే యేమిటి?

సత్యవీర వెంకట బుచ్చిబాబు — అతని పూర్తి పేరు.

బుచ్చి, విమల అన్న అయిన మధుసూదనానికి

హైస్కూలు ఫ్రెండు. ఇద్దరూ చెరో వూరూ పోయి చెరో కాలేజీలో చేరి ఏడెనిమిదేళ్ళపాటు ఒకళ్ళకొకళ్ళు దూరమయ్యారు. ఆర్నెల్ల కిందట హఠాత్తుగా కలుసుకుని పరస్పరం పోల్చుకుని సంతోషించుకుని పూర్వ స్నేహాన్ని పునరుద్ధరించుకున్నారు. అప్పట్నుంచీ బుచ్చి మధుసూదనం వాళ్ళింటికి వారం పది రోజులకోసారి వచ్చిపోతూనే వున్నాడు. ఎప్పుడూ మందపాటి అద్దాల కళ్ళజోడు పెట్టుకునే వుంటాడు.

"అతనికి షార్ట్ సైటా?" అంది విమల ఒకసారి అన్నగారితో.

"ఏదో ఒకటిలెద్దూ! అందంగానే వుందిగా?" అన్నాడు మధుసూదనం.

"అదే గమ్మత్తు. అతను మోకాళ్ళు మునిగే చొక్కాలు వేసుకున్నా అందంగానే వుంది" అంది విమల, వెటకారంగా.

మిగతా స్నేహితుల్లా చొరవగా ఇంట్లోకి రాడు బుచ్చి. మధుసూదనంతో తప్పితే ఇంట్లో ఎవ్వరితోటీ మాట్లాడడు. అనుకోకుండా ఇంట్లో ఆడవాళ్ళు తారసపడితే సిగ్గుపడ్డవాడిలా తప్పించేసుకుంటాడు. సమయానికి మధుసూదనం ఇంట్లో లేడని తెలిస్తే చీడీలైనా ఎక్కకుండా వెనక్కి తిరిగి వచ్చిన దారి పడతాడు.

ఓసారెప్పుడో విమల కాఫీ ఇస్తోంటే "మా సెకండ్ సిస్టరోయ్, విమల" అంటూ పరిచయం చేశాడు మధుసూదనం.

"నమస్తే" అన్న విమల్ని మొహం చూడకుండానే పేపరు కాస్త కదిలించి "నమస్.... కారం" అన్నాడు బుచ్చి తడుముకుంటూ. ఆ మాట పైకి వినిపించనే లేదు.

అన్నగారు లోపలికి రాగానే విమల కోపంగా "నువ్వేదో కాఫీ తెమ్మన్నావని తెచ్చా. పరిచయాలూ పాడూ ఎందుకు గొప్పగా? చదువుకున్నవాడు కూడాను, ఆ మాత్రం సభ్యత లేదేం? నమస్తే అంటే నోరే ఎత్తలేదు!" అంటూ ఎగిరింది అన్న మీద.

"పోనిద్దూ! అతని తరహా అంతే. చాలా సిగ్గు" అన్నాడు మధుసూదనం.

"ఆఁ సిగ్గు, మన దగ్గిరే!"

"ఎవరికే సిగ్గు?" అంటూ వచ్చింది రజని. విమల అక్క నవ్వుతూ.

"ఇంకెవరికి? పాపం.... బుచ్చిబాబుకి. ఇంటి పేరేవిట్రా అన్నయ్యా? అచ్చాకుల బుచ్చిబాబా?" అంది వెక్కిరింతగా విమల.

మధుసూదనం చెల్లెళ్ళతో పాటు నవ్వేశాడు.

ఇంకోసారి, విమల పరుగెత్తుకుంటూ వచ్చింది గదిలోకి — "అక్కయ్యా! మొద్దబ్బాయి వస్తున్నాడే!" అంటూ.

"మొద్దబ్బాయెవరు?" అని తెల్లబోయింది రజని.

"రా! చూపిస్తాను."

రజని బయటికి వెళ్ళి, దిక్కులు చూస్తూ చీడీలమీద నించున్న బుచ్చిబాబుని చూసి నవ్వు ఆపుకుంటూ ఆప్యాయంగా పలకరించింది. "అన్నయ్య లేడండీ! మీరొస్తే వుండమని చెప్పమన్నాడు. గదిలో కూర్చోండి."

అప్పటికే బుచ్చి వెనక్కి తిరిగాడు. "మళ్ళీ.... వస్తానని చెప్పండి .... మధుతో."

".... ఫర్వాలేదు. కాసేపు కూర్చోండి. కాఫీ తాగి వెళ్ళొచ్చు" అంది రజని.

"అబ్బే!.... వెళతానండీ!" అంటూ, వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు బుచ్చి.

"చూశావా? కాఫీ మాట ఎత్తితే 'థాంక్స్' అయినా చెప్పలేదు. బొత్తిగా అంత మర్యాద తెలీదేం?" అని విమల రుస రుసలాడింది.

"అబ్బ, ఊరుకుందూ! అస్తమానూ ఎదటవాళ్ళని విమర్శించటం మర్యాదాయేమిటి?" అంది రజని లోపలికొస్తూ.

"ఏమో! నీకు కాబట్టి కోపం రాలేదుగానీ నేనైతే అంత మర్యాద లేనివాడితో ఛస్తే.... మాట్లాడను" అంటూ పౌరుషం ప్రకటించింది విమల.

మధుసూదనం వచ్చాక రజని నవ్వుతూ "విమల నీ ఫ్రెండుకో ముద్దు పేరు పెట్టింది" అని చెప్పింది.

"ఏమిటి? ఎవరికి?"

విషయం తెలుసుకుని మధుసూదనం విమల్ని నవ్వుతూ కేకలేశాడు. "బుచ్చిబాబు విషయంలో పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. చాలా మంచివాడు తెలుసా?"

"చా.... లా....! ఎంత? ఇంతా?" అంటూ విమల

రెండు చేతులూ ఎడంగా చాచింది.

"చాల్లే! అతనికి తెలిస్తే బాగుండదు."

"డోంట్ వర్రీ బ్రదర్! ఇలాంటి చిన్న చిన్న బాగుల్ని ఖాతరు చెయ్యడు. అసలే మొద్దబ్బాయి. శరత్ ఇలాంటివాణ్ణి చూసే 'బడదీదీ' రాశాడు."

మధుసూదనం బాగా నవ్వాడు.

H H H

ఏడెనిమిది నెలలైనా బుచ్చిబాబు ప్రవర్తనలో మార్పు లేదు. ప్రతీ ఆదివారం సాయంత్రం వేళ వస్తాడు. గదిలో మధుసూదనం దగ్గర కూర్చుంటాడు. కాస్సేపేవో కబుర్లు .... కంఠం గదిలోంచి బయటికి రాకుండా మాట్లాడతాడు. గంటకి ఇటూ అటూగా లేచి వెళ్ళిపోతాడు.

మొదటిసారి ఎలా వున్నాడో ముప్ఫైసార్లు వచ్చినా అంతే. ఆ గది దాటి లోపలికి అడుగు వెయ్యలేదు.

ఒకసారి విమల బయటినుంచి వస్తూ గేటు దగ్గిర యెదురుపడ్డ బుచ్చిబాబుని తలెత్తి చూసింది, చాలా దగ్గిరిగా.

అప్రయత్నంగా బుచ్చిబాబు కూడా విమల మొహంలోకి చూశాడు. తప్పుకుని వెళ్ళిపోయాడు. విమల అతన్ని చూస్తూ వెనక్కి నడిచింది.

"ఏమిటేవ్, మొద్దబ్బాయిని అంత పరీక్షగా చూస్తున్నావ్?" గుమ్మంలో నిలబడ్డ రజని అడిగింది.

"అబ్బే! ఏం లేదు" అంటూ విమల లోపలకెళ్ళి పోయింది. చాలాసేపు ఒక్కతే గదిలో కూర్చుంది. ఏదో పుస్తకం తీసి చదవబోయింది. మళ్ళీ మూసి పడేసింది. కిటికీ దగ్గిరికి వెళ్ళి నించుంది గేటుకేసి చూస్తూ. 'పాపం, అతను మంచివాడిలాగే వున్నాడే! ఎంత చక్కగా .... ఎంత ఆప్యాయంగా .... ఎంత మృదువుగా చూశాడు! ఎంత మంచిగా అన్పించాడు!'

బుచ్చిబాబు గురించి విమల అంత తర్కించుకోవడం చాలా కొత్త. తన ఆలోచనలన్నీ విమలకే కొత్తగా, ఆశ్చర్యంగా అనిపించాయి.

ఇన్నాళ్ళూ తను అర్థం చేసుకోలేదుగానీ, అతను, తననుకున్నంత తెలివితక్కువవాడు కాడు. గర్విష్ఠీ కాడు. అంతవరకూ నిజం. ఎంత నిర్మలంగా, ఎంత అభిమానంగా చూశాడు!

ఆ రోజు తర్వాత, బుచ్చిబాబు ప్రసక్తి ఎన్నిసార్లు వచ్చినా, విమల ఏమీ కామెంట్ చెయ్యలేదు. ఏవీ విననట్టు ఊరుకుంది చాలాసార్లు.

రజని ఏవో మాటల మధ్య "మొద్దబ్బాయి వచ్చినా ఒకటే, వెళ్ళినా ఒకటే" అంది ఎప్పటిలా.

రజని మాటలు అంతగా నచ్చలేదు విమలకి. కొంచెం కోపంగా — "ఏదో కొన్నాళ్ళు వెక్కిరించాం. అస్తమానూ అదే పాటా?" అని విసుక్కుంది.

రజని ఆశ్చర్యపోయి "ఏమిటేవ్, మొద్దబ్బాయిని వెనకేసుకొస్తున్నావ్? అతగాడి కా పేరు పెట్టిందెవరో మరిచి పోయినట్టున్నావే!" అంది.

"పెడితే పెట్టాలే. నాదే బుద్ధి తక్కువ. అతనేం మేనర్స్ తెలీనివాడు కాదు" అని నవ్వేసింది విమల.

రజని తెల్లబోయింది— "ఏమిటమ్మా, హఠాత్తుగా ఇంత బుద్ధిమంతురాలివయ్యావు? ఎటొచ్చీ బుద్ధి లేనిదాన్ని నేనేనా?"

విమల రెట్టించలేదు. అతన్ని గురించి హాస్యంగా అనుకోటానికి అప్పటినించీ మనస్కరించలేదు విమలకి.

ఆ వేళ— మళ్ళీ వచ్చాడు బుచ్చిబాబు.

ఎప్పట్లాగా వుండలేకపోయింది, విమల.

అతను మాట్లాడే మాట ఒక్కటైనా వినిపిస్తుందేమోనని ఒళ్ళంతా చెవులు చేసుకుని వినాలని ప్రయత్నించింది. వీధి గుమ్మంలో నుంచుంటే వెళ్ళేప్పుడైనా కనపడతాడేమో, చూస్తాడేమోనని ఆశపడింది.

అతనా? మొద్దబ్బాయ్! కాకపోతే ఏమిటి? విమల ఆ పరిసరాల్లో వున్నట్టే గమనించలేదు. వెళ్ళేటప్పుడు గుమ్మంకేసి తల తిప్పనే లేదు. తిన్నగా వెళ్ళిపోయాడు.

విమలకి కోపం రాలేదు. అతను కనిపించేంత వరకూ చూస్తూ నించుంది. బుర్ర బద్దలు కొట్టుకుని ఆలోచిస్తున్న కొద్దీ 'బడదీదీ' హీరో గుర్తొచ్చాడు. "నిజం, నిజం. అలాంటివాడే ఇతను! అబ్బ! అలాంటి వాళ్ళు ఎంత ప్రేమిస్తారో!" అనుకుంది ఎన్నిసార్లో!

రాత్రి అన్నం తింటూ మధుసూదనం తల్లితో, "బుచ్చిబాబు ఒప్పుకుంటే.... విమలనిస్తే బాగుంటుంది కదా?" అన్నాడు.

విమల తుళ్ళిపడింది. నెమ్మదిగా గుమ్మంలోంచి

తప్పుకుంది.

"బాగానే వుంటుంది. విమ లేమంటుందో?"

తల్లి సందేహం!

"ఇంకేమంటుంది? అతన్నేమైనా అంటే మండి పడుతోందిగా? ఈమధ్య చాలా మారిందిలే. ఒప్పు కుంటుంది" అంది రజని.

"సరే! ఇద్దరూ ఒప్పుకుంటేనే. లేకపోతే మనమేం చేస్తాం?" అంటూ లేచాడు మధుసూదనం.

"ఒప్పుకుంటే పెళ్ళి చేసేద్దాం కూడా. కావాలంటే ఒక సంవత్సరం పాటిక్కడే వుండి బియ్యే పూర్తి చేస్తుంది" అంది తల్లి.

"అలాగే! రజనిలాగే అదీ వుంటుంది."

"వదినగారు వచ్చేవరకేలే మా ఇద్దరి భోగం! ఆవిడ ఎక్కడనించో వూడిపడిందంటే, మా ఆయన ట్రెయినింగ్ అవనీ మాననీ, విమల చదువు సాగనీ చతికిలబడనీ .... కఱ్ఱ పుచ్చుకుంటుంది" అంది రజని హాస్యంగా.

"ఆవిడెవత్తో వచ్చి కఱ్ఱ పుచ్చుకోకపోతే మాత్రం మీ మొగుళ్ళని మీరు వదిలేసుకుంటారా?" అంటూ నవ్వి వెళ్ళిపోయాడు మధుసూదనం.

విమలకి మనసు మనసులో లేదు.

ఇదేవిటి! అతనితోనా తన పెళ్ళి? అతను మంచి వాడేగానీ .... అతను .... ఏమో!

విమలకి భయంగానూ అనిపించింది. ఇష్టంగానూ అనిపించింది.

బుచ్చిబాబుని గురించి నిర్భయంగా, స్వేచ్ఛగా, ఆలోచించడం ప్రారంభించింది ఆమె అంతరంగం.

అతనిది సాధు స్వభావం. వ్యసనాలు లేవు. చిల్లర మల్లర వేషాలు లేవు. ఆడపిల్లల వేపు కన్నెత్తి చూడడు. ఈ రోజుల్లో ఇంత మంచి కుర్రాళ్ళెక్కడుంటున్నారు? బుచ్చిబాబు ఒప్పుకోడా? ఒప్పుకుంటాడు. ఎందుకో తనకా నమ్మకం వుంది. ఒప్పుకుంటే....? పెళ్ళయితే? ఏం మాట్లాడతాడబ్బా? అసలు నోరు విప్పుతాడా అని....!

ఆ, తన తెలివి తక్కువగానీ, అస లిలాంటి వాళ్ళే పెళ్ళాల్ని వదలకుండా తిరుగుతారు. ఎప్పుడూ ఎవరి తోనూ స్వేచ్ఛగా మాట్లాడి వుండక, భార్యతో తనివితీరా కబుర్లేసుకుంటారు. పెళ్ళాం గీచిన గీటు దాటక, పెళ్ళాన్ని సంతోషపెట్టాలని విశ్వప్రయత్నం చేస్తారు.

అబ్బా! భార్యాభర్తలు అలాంటి ప్రేమలతో వుంటే.... దాంపత్యం ఎంత అన్యోన్యంగా వుంటుంది! అంత మంచి భర్త దొరికితే ఆడపిల్లకింకేం కావాలి?

H H H

మధుసూదనం అడిగిన మాటకి బుచ్చిబాబు వెంటనే జవాబు చెప్పలేదు. దీర్ఘాలోచనలోంచి బయటపడ్డట్టు అన్నాడు "మీ చెల్లెల్ని అడిగావా?"

"మా అమ్మ అడిగింది. ఒప్పుకుందట."

బుచ్చిబాబు మళ్ళీ కాస్సేపు మౌన ముద్ర పట్టాడు. తర్వాత అన్నాడు, సంకోచంగా — "నే నడగనా?"

ఆశ్చర్యపడ్డాడు మధుసూదనం. "అలాగే అడుగు, దానికేం?" అన్నాడు నవ్వుతూ.

"ఎప్పుడు?"

"సాయంత్రం ముగ్గురం బీచ్‌కి వెళ్దాం."

బుచ్చి మళ్ళీ మౌనం వహించాడు.

"అలా మొహం ముడుచుకోకోయ్! మీ దగ్గిర నేను కూర్చోనులే" అంటూ లేచాడు మధుసూదనం.

"అబ్బే! అది కాదు" అంటూ తడబడ్డాడు బుచ్చి బాబు.

H H H

మధుసూదనం, విమలా కబుర్లు చెప్పుకుంటూ బీచ్‌లో నడుస్తోంటే దారిలో కలిశాడు బుచ్చిబాబు.

విమల, చూడనట్టు తల తిప్పుకుంది.

మధుసూదనం దారిన పోయే రిక్షాని పిల్చి విమల కేసి చూస్తూ "నాక్కొంచెం పనుంది విమలా! ఒక గంటలో వచ్చేస్తా. మీ రిద్దరూ అలా వెళ్ళి కూర్చోండి" అనేసి రిక్షా ఎక్కేశాడు.

తెల్లబోయింది విమల. గబ గబా నాలుగడుగులు వేసి రిక్షా దగ్గిరికి వెళ్ళి అన్నగారిని మింగేలా చూస్తూ "నీకేం బుద్ధిలేదూ? తీరా తీసుకొచ్చి .... ఇదేమిటి?" అంటూ మండిపడింది.

మధుసూదనం చెల్లెలి మొహం దగ్గరకి మొహం పెట్టి "ఫర్వాలేదు. అతను నీతో ఏదో మాట్లాడుతాడట. వెళ్ళు! పోనీవోయ్ తొందరగా...." అంటూ రిక్షా అతనికి ఆర్డరిచ్చేశాడు. చూస్తూ చూస్తూ వుండగా వెళ్ళి

పోయింది రిక్షా.

కొయ్యబారిపోయింది విమల.

బుచ్చిబాబు గొంతు పెగుల్చుకోక తప్పలేదు. "రండి, అలా వెళ్దాం" అన్నాడు దిక్కులు చూస్తూ.

విమల మాట్లాడకుండా నడిచింది. కాస్సేపటికి స్నేహితులిద్దరి మధ్యా జరిగిన గూడుపుఠాణీ విమలకి అర్థమైంది— "అమ్మో! ఇతగాడు మొద్దబ్బాయి కాడే!" అనుకుంది.

ఇద్దరూ బీచ్ రోడ్‌లో నడుస్తూ చాలా దూరం వెళ్ళారు. ఎవరు ముందు కూర్చోవాలో తెలీక, యెక్కడా ఆగకుండా నడుస్తూ వెళ్ళారు.

విమలకి కాళ్ళు నొప్పులెట్టాయి. కాస్సేపు నిల బడింది.

"కూర్చోండి. ఇక్కడ కూర్చుందాం" అంటూ తను ఇసకలో కూర్చున్నాడు బుచ్చిబాబు. విమల కూడా బుచ్చిబాబుకి సమీపంగా కూర్చుంది. బుచ్చి కళ్ళజోడు తుడిచి చేత్తో పట్టుకున్నాడు. చాలాసేపు సముద్రంకేసి చూస్తూ వుండిపోయాడు.

విమల మనస్సంతా ఆశ్చర్యంలో మునిగిపోయి వుంది. ఎవ్వరితోటీ మాట్లాడనివాడు, ఎవ్వర్నీ కన్నెత్తి చూడనివాడు, తనకి అంత ప్రత్యేకత ఇచ్చాడంటే.... సంభ్రమంగా వుంది.

మాట్లాడాలని ప్రయత్నిస్తూ బుచ్చిబాబు తికమక పడటం చూస్తే విమలకి జాలేసింది.

తలెత్తి, చిరునవ్వు చిందిస్తూ, పెదవి నొక్కి పట్టుకుని కళ్ళు విప్పార్చుకుని, నిస్సంకోచంగా అతనికేసి చూసింది.

బుచ్చి అవకాశం దొరికినవాడిలా ధైర్యంగా చూస్తూ — "మీతో.... కొంచెం మాట్లాడతానని నేనే అన్నాను మధుతో" అన్నాడు నెమ్మదిగా.

విమల, చూపులు ఇసకలో గుచ్చి, శ్రద్ధగా వింది.

"మీ అన్నయ్య .... పెళ్ళి కబురేదో .... చెప్పాడు .... మీ కిష్టమేనా, నేనే స్వయంగా తెలుసుకోవాలనీ...."

విమల ఆశ్చర్యపోయింది, కొత్తగా బుచ్చి మాటలు వింటున్నట్టు! పెళ్ళికి .... జీవిత భాగస్వామినికి .... ఎంత విలువ ఇవ్వకపోతే అతనింత శ్రద్ధ తీసుకుంటాడు! తనకి ఇష్టమో కాదో, స్వయంగా అడిగి తెలుసుకోకపోతే అతనికి తృప్తి వుండదా? ఏం చెప్పాలి తను? ఎంత ఇష్టమో యెలా చెప్పాలి?

బుచ్చిబాబు పది నిమిషాలు ఓపిక పట్టాడు.

విమల నోరు విప్పలేదు.

"పోనీలెండి. మీ అన్నయ్యతో అయినా చెప్పండి, మీకిష్టంలేదని. లేకపోతే .... లగ్నాలూ అవీ అంటున్నాడు."

విమల చప్పున తలెత్తింది. ఒక్కక్షణం చూసింది.

ఆతృతగా చూస్తున్నాడు బుచ్చిబాబు!

విమల మనస్సంతా అనురాగంతో పొంగిపొర్లింది. శరీరం పులకరించింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

నెమ్మదిగా తల దించుకొంది. బుచ్చిబాబు తనకెంతో ఆప్తుడు! సన్నిహితుడు! తన ఆరాధనంతా ఒక్క మాటలో ఎలా వెల్లడించాలి? అప్రయత్నంగా అంది. "మీరంటే నాకిష్టం లేదని ఎందుకు అనుకున్నారు? మీ పాదాల దగ్గిర కొంచెం చోటు ఇవ్వండి, చాలు!" ఆ మాటలు మనస్సులోంచి బయటపడగానే అమితంగా సిగ్గుపడిపోయింది. అతని మొహం చూడకుండా మోకాళ్ళ మీదికి తల ఆన్చుకుని మొగ్గలా ముడుచుకు కూర్చుంది.

ఛ! బొత్తిగా తను భావుకతతో మాట్లాడింది. 'పాదాల దగ్గిర చోటే'విఁటీ? 'మీరంటే నా కిష్టమే' అంటే సరిపోయేది కదా? — పోనీలే, ఇప్పుడేం మించిపోయింది? తన మనస్సేఁవిటో అతనికి ఇంకా బాగా తెలుస్తుంది. రేపు పెళ్ళి చేసుకోబోయేవాళ్ళు ఎలా మాట్లాడుకుంటే మాత్రం తప్పేమిటి? ఫర్వాలేదు. తను చక్కగానే మాట్లాడింది — ఈ మొద్దబ్బాయి అసలు విన్నాడా, లేదా? జవాబు చెప్పడేం?

ఇద్దరూ సముద్రం హోరు వింటూ ప్రతిమల్లా కూర్చున్నారు చాలాసేపు.

ఎప్పటికో మేలుకున్నట్టు "బాగా చీకటి పడింది. వెళ్దాం" అంటూ లేచాడు.

విమల కూడా లేచింది.

నడుస్తోన్నవాడల్లా ఆగి విమలకేసి చూశాడు, నవ్వుమొహంతో, "ఇందాకా .... ఏదో అన్నారు మీరు .... కానీ .... మీ చోటు .... నీ చోటు .... పాదాల దగ్గిర కాదు .... విమలా! ... నా మనసులో! నా హృదయంలో!"

విమల ముగ్ధురాలైపోయినట్టు మాట్లాడలేక పోయింది.

H H H

బుచ్చిబాబు గురించి అంతా తెలుసనుకున్న విమలకి, ఏమీ తెలీదని తెలియటానికి ఎన్నాళ్ళో పట్టలేదు.

బుచ్చి ఏమిటో తెలుస్తోన్నకొద్దీ గాభరా పుట్టింది విమలకి. పెళ్ళయి తను సన్నిహితంగా చేరితే ఏవేవో మాట్లాడుతాడనుకుందిగానీ .... అప్పుడో మాటా .... అప్పుడో పలుకూ .... ఎప్పట్లాగే మొద్దబ్బాయిలాగే వుంటున్నాడు.

"గంటల తరబడీ ఏమీ మాట్లాడరేం?"

"ఏం మాట్లాడనూ?"

"మాటలు రావా?"

"అలాగే వుంది నిన్ను చూస్తోంటే."

"మతిపోతోందా?"

"కాదు విమలా! నువ్వు చాలా బాగున్నావు."

"ఆ కుర్చీ కంటేనా?"

"దానికదే బాగుంది. నీకు నువ్వే బాగున్నావు."

"నా ఖర్మ!" అంటూ నుదురు కొట్టుకుంది విమల.

బుచ్చి నవ్వి వూరుకున్నాడు.

H H H

"ఇవ్వాళేదైనా సినిమాకెళ్దామా?" అంది విమల.

"నువ్వు వెళ్దామంటే వెళ్దాం."

"అబ్బ! ఏం ప్రేమ! అంతేగానీ నీ కిష్టంలేదా?"

"ఎందుకిష్టం లేదూ?"

"అసలు సినిమాలు నీకు నచ్చుతాయా?"

"అదేం ప్రశ్న? మంచివి అయితే ఎందుకు నచ్చవూ?"

"ఏదీ, నీకు నచ్చిన మంచి సినిమా ఒకటి చెప్పూ!"

"'శ్రీరామ జననం' ఎంత బాగుంటుంది విమలా! మా అమ్మమ్మ ఆ కథంతా చెప్పి ఆ సినిమాకి రొండు సార్లు తీసికెళ్ళింది. ఆ పాటలన్నీ వొచ్చు నాకు, పాడనా?"

"ఇదా నీ సంగతి! నువ్వింకా ఏదో వీరుడివి అనుకుంటున్నాను. అసలు పెళ్ళికి ముందే 'నీకేం సినిమాలు నచ్చాయి?' అని అడగాలన్న మాట! అయ్యయ్యో, ఇప్పటిదాకా తోచలేదు. సరే, ఇంకేం చేస్తాను? నీ తోటే వేగాలి కదా? ఇప్పుడు మనం వెళ్ళేది శ్రీరామ జననాలకీ శ్రీకృష్ణ లీలలకీ కాదు. 'బాటసారి'కి వెళ్దాం. అందులో నీ బ్రదరున్నాడు, అచ్చం నీ కళ్ళజోడే పెట్టుకుని."

బుచ్చి కాదనలేదు. ఒప్పుకున్నాడు నవ్వుతూ.

ఇంటర్‌వెల్‌లో అడిగాడు — "ఈ సినిమా పేరేంటన్నావ్?"

విమల కంగారుగా ఇటూ అటూ చూసింది, ఎవరన్నా విన్నారేమోనని. మొగుడి చెవి మెలి పెడదామనిపించింది. "కాస్త నెమ్మదిగా అడగరాదూ?" అంది రుసరుసలాడుతూ.

బుచ్చికేం అర్థం కాలేదు. సినిమా పేరడిగితే తప్పేవిటీ మరీనూ!

ఆఖర్న లేస్తూ అన్నాడు — "ఇందులో వేసిన అమ్మాయి ఎవరూ? నాగేసర్రావు తెలుసనుకో!"

భానుమతి తెలియనివాడు! విమల, మనసులో నెత్తి కొట్టుకుంది.

H H H

"మా ఇంటికి వచ్చినప్పుడల్లా బుద్ధిగా కూర్చుంటే ఏమిటో అనుకున్నాను. అబ్బాయిగారికి సిగరెట్ల షోకు వుందని నాకేం తెలుసూ?" అంటూ విమల, అగ్గిపెట్టి గిరాటేసింది.

బుచ్చి సిగరెట్లు కాలుస్తాడు. మాన్పించాలని విమల చాలా ప్రయత్నాలు చేసింది. చెప్పాలంటే, అవి గట్టి గట్టి ప్రయత్నాలేం కావు. అన్నీ చిట్టి పొట్టి ప్రయత్నాలే. ఒక రోజు వాదానికి కూర్చుంది. "చూడండీ, ఈ సిగరెట్లు కాల్చటం, పీల్చటం, ఇదంతా నాకేం బాగలేదు."

బుచ్చి ఆశ్చర్యంగా చూశాడు.

"మధ్య నీ కెందుకు బాగాలేదు?"

"మీ ఆరోగ్యం పాడయితే నాక్కాదూ?"

మరీ ఆశ్చర్యంగా చూశాడు — "పదేళ్ళనించీ అలవాటేగా? ఎప్పుడూ తలనొప్పన్నా రాలా!"

"ఇప్పుడేం రాదు. రేపట్నుంచీ వయసు పెరిగితే...."

"అప్పుడు మానేస్తాలే" తాపీగా అన్నాడు బుచ్చిబాబు.

మింగేసేలా చూసింది విమల — "ఈ వెధవ సిగరెట్లు .... కంపుకొడుతూ, ఏం రుచి?"

"ఇప్పుడు నేనిది మానేస్తే .... నాలాగ అందరూ మానేస్తే, సిగరెట్ల కంపెనీలన్నీ ఏమైపోవాలి చెప్పు? ఎంతమందికి పని లేకుండా పోతుందో ఆలోచించు!" బుచ్చిబాబు కూడా అప్పుడప్పుడూ చిన్న చిన్న ఉపన్యాసాలివ్వగలడు.

"ఓహో, అలాగా? ఇవ్వాల్టినించీ నేను కూడా కాలుస్తాను. నాలాగా ఆడవాళ్ళందరూ కాలుస్తారు. ఎన్ని కొత్త కంపెనీలు లేస్తాయో తెలుసా? ఎంతమంది నిరుద్యోగులకు పని దొరుకుతుందో ఆలోచించండి!"

"కంగ్రాచ్యులేషన్స్! స్త్రీలు పురోగమించాలి. హ్యావ్ ఒన్ ప్లీజ్!" అంటూ ఒక సిగరెట్టు తీసి ఇవ్వబోయాడు బుచ్చి.

విమల దాన్ని ఎగరకొట్టి విసురుగా లేచి వెళ్ళిపోయింది.

H H H

మధ్యాన్నం ఇల్లంతా సర్ది, వంటచేసి, చీకటి పడుతోంటే స్నానం చేసి తెల్లటి వాయిల్ చీర కట్టుకుని, సింగారించుకుని, గులాబీసెంటు రాసుకుని, ఎదురుచూస్తూ కూర్చుంది విమల. గుర్తొచ్చి బీరువాలోంచి 'కిన్నెరసాని' తీసుకుని చదువుకుంటూ కూర్చుంది.

బుచ్చిబాబు వచ్చాడు. ఇంటినీ, ఇల్లాలినీ గుర్తించిన వైనం కన్పించలేదు.

"కొత్త చీర కట్టావే!" అంటాడేమో అనుకుంది. ఒకసారి పైట జారవిడిచి సర్దుకుంది కూడా.

బట్టలు మార్చుకుని వెనక్కి తిరిగాడు. "విమలా! కాఫీ లేదా?"

"లేదు. కాలు తగిలి ఒలికిపోయాయి పాలు" అంది కోపంగా.

"పోనీలే" అని సిగరెట్టు వెలిగించుకుని కుర్చీలో కూర్చున్నాడు.

కాస్సేపటికి "అయ్యో, నువ్వు తాగలేదా అయితే? కొంచెం పాలు తీసుకురానా?" అన్నాడు ఆతృతగా.

విమలకి మనసు కరిగిపోయింది. గబగబా లోపలికి వెళ్ళి ట్రేలో అన్నీ సర్ది తీసుకొచ్చింది. నవ్వుతూ "మీ మంచితనం పరీక్ష చేశాను, మీరే నెగ్గారు. అల్పాహారం స్వీకరించండి" అంది దగ్గిర కూర్చుంటూ.

"ఎక్కడో సెంటు వాసనలాంటి దొస్తోందే!" అన్నాడు చుట్టూ చూస్తూ, ఉప్మా బొక్కుతూ.

"ఫర్వాలేదు. మీ ముక్కు పని చేస్తోంది!" అంది విమల తృప్తిగా.

బుచ్చిబాబు తింటోంటే విమల మళ్ళీ పుస్తకం అందుకుంది. "'కిన్నెరసాని' ఎంత బాగుంటుందో! చదివారా?"

"అదెవరు?"

"సరి, 'విశ్వనాథ వారి' పుస్తకం!"

"వాడెవడు?"

"అవ్వ!" అని నోరు నొక్కుకుంది విమల. ఆమెకి చాలా కోపం వచ్చింది. "మీకు పెళ్ళికి ముందు 'మొద్దబ్బాయి' అని పేరెట్టానుగానీ, న్యాయంగా, ధర్మంగా ఆలోచిస్తే 'బుద్ధావతారం' అనాలి" అంది ఎర్రగా చూస్తూ.

బుచ్చిబాబు కాఫీ కప్పు కింద పెడుతూ తీరిగ్గా కుర్చీలో వెనక్కి వాలి— "నీకెలా ఇష్టమైతే అలాగే పిల్చుకో" అన్నాడు.

"నా ఖర్మ!" అని తల పట్టుకుంది విమల.

ఆ వేడిలో ఒక స్నేహితురాలికి ఉత్తరం రాస్తూ బుచ్చిని కసిదీరా ఏకిపారేసింది. "నా 'పతిదేవుడు' అద్భుతమైన మనిషి! న భూతో న భవిష్యతి! ఇంటి సంగతీ, ఇల్లాలి సంగతీ పట్టవు. పుస్తకాలు చదవడు. అర్థం కావు! సినిమాలు చూడడు, బోధపడవు! స్నేహితుల్లేరు, నిలవలేరు! సిగరెట్లు కాలుస్తాడమ్మాయ్! నాకూ కాల్చే స్వాతంత్ర్యం ఇచ్చాడు. నోట్లో వేలు పెడితే కొరకలేడమ్మా! నా చదువు అర్ధాంతరం చేసుకుని కాలేజి యెగ్గొట్టి ఇందులోకి దిగాను. ఈ బుద్ధావతారం — నన్ను ఏ నట్టేట్లో ముంచేస్తాడోనని భయంతో చస్తున్నాను. ఈ ఉదంతం విన్నావు కదా? నీ అమూల్యాభిప్రాయం ఏమిటి నేస్తం?" అని బరబరా గీసి పారేసింది ఆ ఉత్తరం.

తిరుగు టపాలో స్నేహితురాలు జవాబు రాసింది. "నువ్వెంత అదృష్టవంతురాలివే విమలా! నాకు అసూ

యగా వుంది. మొగవాడు మెత్తని వాడైతే ఆడదానికి నిశ్చింతగా, హాయిగా వుంటుంది. దెబ్బలాటలుండవు! కుతర్కాలుండవు. దాంపత్యం అన్యోన్యంగా సాగుతుంది. మనలో మనమాట. ఆడదాని మాట పై మాటగా వుంటుంది. పై చేతలు చెయ్యకు సుమా! అతగాణ్ణి అపురూపంగా చూసుకోవాలమ్మా! ఎన్ని నోములు నోచావో...."

"నా ఖర్మ" అని ఉత్తరం పారేసి రెండుచేతుల మధ్యా తల పట్టుకుంది విమల. 'స్నేహితురాలు కూడా శత్రువైపోవాలా!' అంటూ వాపోయింది.

H H H

విమలా బుచ్చిబాబుల సంసార నౌక ఆనందంతో తూగుతూ ఒక మజిలీ చేరింది. అక్కడ 'చంటివాణ్ణి' యెక్కించుకుంది. ఆడుతూ పాడుతూ మరో రెండు మజిలీలు చేరింది.

ఒక్కో మజిలీ చేరుతోన్న కొద్దీ విమలకి పాత సమస్యలు కొత్తవై కూర్చుంటున్నాయి.

మచ్చుకి — "ఇదుగో! సిగరెట్టు కాల్చకోయ్ అని ఇన్నేళ్ళూ మొత్తుకున్నాను. విన్నావు కాదు. పోనీ ఆ పీకలు యాష్ట్రేలో పడెయ్యవోయ్ అని అఘోరించాను. చెవినబెట్టావు కాదు. చూడు, చంటి వెధవ పెద్ద వెధవౌతున్నాడు. ఆ సిగరెట్టు ముక్కలు దొరకబుచ్చుకుని చప్పరిస్తున్నాడు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని సిగరెట్లు మానేస్తావా లేదా?"

భార్యామణి వాంఛితం ఏమిటో బుచ్చబ్బాయికి తెలుసు. తనతో ఏదో పోట్లాట కావాలి విమలకి. "నువ్వు కోసి పారేసిన తోటకూర కాడలు వాడు నమలటం లక్ష సార్లు చూశాను" అంటాడు.

"తోట కూరలో విటమిన్లున్నాయి. నీ సిగరెట్టు పీకల్లో ఏముంది? వెధవ కంపు!"

"ఆ కంపు సొంపు నీకేం తెలుసు? ఒరే బుజ్జీ! ఇట్రా నాన్నా! ఇదిగో! ఈ సిగరెట్టు కాల్చు" అంటూ బుచ్చిబాబు ఒక కొత్త సిగరెట్టు తీసి కొడుక్కి అందిస్తాడు. చంటి వెధవ వాళ్ళ నాన్న ఒడిలో కూర్చుని నోట్లో సిగరెట్టు పెట్టుకొని వాళ్ళమ్మని వెక్కిరిస్తాడు.

విమలకి కంపరం పుడుతుంది. "నీ చదువూ చట్టుబండలూ ఎందుకు, సింగినాదానికా? పిల్లాడికో క్రమశిక్షణా లేదు. పాడూ లేదు. ఎంత చక్కగా పెంచాలీ పిల్లల్ని!"

"నీ మొహం క్రమ శిక్షణ! నువ్వు పెరుగుదూ!"

"అందుకే అబ్బాయిగారు మొద్దబ్బాయి గారయ్యారు."

"ఆ మొద్దబ్బాయి కోసమేగా అన్న గారితో రాయబారం పంపావు!"

"సిగ్గు లేకపోతే సరి! ఎవరితో ఎవరు మంతనాలు జరిపారో ఇప్పుడు మరిచిపోతే యెలాగ?"

"అవును, 'మీ పాదాల దగ్గిర కొంచెం చోటు ఇవ్వండి' అని ఎవరు ఎవర్ని ప్రార్థించారో కూడా మరిచిపోకూడదు."

విమల, ఆ తగువంతా మరిచిపోయి నవ్వుతూ దగ్గిరకొచ్చి "ఈ మొద్దు మొహాని కింత జ్ఞాపకం వుంటుందని నాకేం తెలుసూ? ఇదిగో! మళ్ళీ ఆ మాట ఎత్తావంటే వూరుకోను" అంటుంది.

"ఊరుకోకు" అని రెట్టిస్తాడు బుచ్చి.

విమల బుగ్గన చెయ్యి పెట్టుకుని — "అమ్మో! ఈ మూడేళ్ళలోనూ మొద్దబ్బాయి చాలా మారాడే! మాటకారయ్యాడు" అంటూ విస్తుబోతుంది.

బుచ్చిబాబు వాదం పెట్టుకున్నప్పుడల్లా విమల లోపల్లోపల సంతోషిస్తుంది. ఆ కిటుకు మూడేళ్ళకి బోధపడింది బుచ్చికి.

H H H

ఒక ఆదివారం! బుచ్చిబాబు ఇద్దరు స్నేహితుల్ని వెంటబెట్టుకొచ్చాడు. ముగ్గురూ కాస్సేపు బుద్ధిగా కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత — "ఏం తోచడం లేదోయ్! కాస్సేపు...." అంటూ నసిగాడో మార్గదర్శి.

"అసలు దస్తుందా?" అన్నాడో దూర దృష్టుడు.

"దస్తంటే?"

"సరి, నీకు 'అ ఆ'ల నించీ చెప్పాలా?" అంటూ ఆ యువకుడే జేబులోనించి దస్తు బైటికి తీశాడు.

"దస్తంటే పేకా?" అని బుచ్చిబాబు కొంచెం నవ్వి, "నాకు సరిగ్గా రాదోయ్" అన్నాడు.

"ఫర్వాలేదు, చెయ్యి కలుపుదూ! అదే వస్తుంది."

ముగ్గురూ పేక ముక్కలు పరిచి కూర్చున్నారు.

విమల తలుపు సందుల్లోంచి చూసింది. పతి దేవుడు పేకాడుతున్న దృశ్యం, ముగ్ధ మనోహరంగా

కన్పించింది. తనివితీరా చూచింది. "పోనీలే, మను షుల్లో పడుతున్నాడు!" అనుకుంది.

కాస్సేపటికి బుచ్చిబాబు లోపలికొచ్చాడు. "విమలా! కొంచెం టీ పెడతావా?" అన్నాడు జంకుతూ.

విమల చటుక్కున లేచి స్టవ్ వెలిగిస్తూ "కాస్సేపు న్నాక రండి, రెడీగా వుంచుతాను" అంది.

పావుగంటకల్లా మూడు ప్లేట్లనిండా జీడి పప్పు ఉప్మా అందంగా సర్ది, వాటిల్లో స్పూన్లు గుచ్చి, కెటిల్ నిండా కాఫీ పోసి, అన్నీ పెద్ద ట్రేలో సర్దిపెట్టింది.

బుచ్చిబాబు చాలా సంతోషించాడు.

స్నేహితులు మూర్ఛలు పోయారు. కాఫీలు తాగి తేరుకున్నారు. అమితంగా ఆనందించారు. "బుచ్చి బాబూ! యూ ఆర్ వెరీ లక్కీ ఫెలో! నీ మిసెస్ చాలా సివిలైజ్డులా వుంది. చాలామంది ఆడవాళ్ళు పేకా టంటేనే మండిపడతారు. కష్టపడి ఆడుకుంటున్నారు కదా పాపం, కాస్త ఫ్రెష్‌గా వుంటారు అని టీ నీళ్ళ యినా ఇవ్వరు. పైగా వెనకనించి తెగ సణుగుతూ వుంటారు. అంతెందుకూ? బాపూ చూడరాదూ? పేకాడే వాళ్ళ పాట్లు ఎంత నేచురల్‌గా చూపిస్తాడో? వాళ్ళావి డెప్పుడో లావుపాటి పప్పు గుత్తి విసిరి వుంటుంది. అందుకే కసిదీరా కార్టూన్‌లు వేస్తూంటాడు ఆడవాళ్ళ మీద. అనుభవం లేకపోతే ఏ ఆర్టిస్టు రాణించడోయ్!" అంటూ దీర్ఘోపన్యాసం ఇచ్చాడు మార్గదర్శి.

వాళ్ళ మాటలన్నీ వింటూ విమల నవ్వుకుంది.

**రెండో** వారం! భోజనాలు చేసి కమ్మగా నిద్రలు పోతోంటే దబ దబా తలుపులు బాది, తీసీ తియ్యగానే బిల బిల్లాడుతూ ఇంట్లో జొరబడ్డారు పేకాట ప్రియులు.

"మీ వాళ్ళంతా వచ్చారండీ!" అంటూ విమల బుచ్చిబాబుని నిద్రలేపింది.

"పొమ్మందూ!" అంటూ బుచ్చిబాబు విమల చెయ్యి పట్టుకుని ముణగదీసుకుని పడుకున్నాడు.

"ఏఁవోయ్! బుచ్చిబాబూ! అంతఃపురంలోంచి రావోయ్! జగన్నాథం, జనార్ధనం వాళ్ళంతా వచ్చారు, లే లే" అంటూ మేలుకొలుపులు పాడారు, వాళ్ళంతా బయటనించి ఎగబడుతూ.

విమల, బుచ్చిని కుదిపి లేపి కూర్చోబెట్టింది. కళ్ళజోడు అందించింది. నెమ్మదిగా గదిలోంచి బయ టికి గెంటింది.

ఒక పావు గంటకల్లా ఆట పాకాన బడింది.

బుచ్చిబాబు లేచి వచ్చాడు — "విమలా! కొంచెం ఉప్మా చెయ్యరాదూ?"

విమల డబ్బాలు వెదికింది — "రవ్వ లేదు. పోనీ కాఫీ పెడతాను."

"సరే, తొందరగా కానీ!"

ఉత్త కాఫీలు చూసి — "నేను సరిగ్గా భోంచెయ్య కుండా ఆదరా బాదరా వచ్చానోయ్!" అంటూ నిట్టూ ర్చాడు మార్గదర్శి.

"పోనీలే! భక్తితో ఇచ్చింది .... ఏదైనా ...." అంటూ కప్పు కాఫీతో తృప్తిపడ్డారు అందరూ.

మూడో ఆదివారం!

"ఇవాళ మ్యాట్నీకి వెళ్దాం" అంది విమల ఉత్సా హంగా.

"అలాగే" అన్నాడు బుచ్చి.

విమల గబగబా పనులు ముగించుకుని తీసి పెట్టుకున్న చీర కట్టుకుంది. నిద్రపోతున్న పిల్లాణ్ణి లేపి చొక్కా తొడిగింది.

వీధి తలుపులు తీసి వున్నాయేమో, పదిమంది వరకూ వచ్చి గుండ్రంగా కూర్చున్నారు, టప్ టప్‌మని పేకలు కలుపుతూ.

"మా వాళ్ళంతా వచ్చారు విమలా!" అంటూ వచ్చాడు బుచ్చిబాబు లోపలికి.

విమల తెల్లబోయింది — "ఇదేమిటి, వీళ్ళు వారం వారం వస్తుంటారా?"

"ఏమో! నాకేం తెలుసూ?"

"అవును, మీకేం తెలుస్తుందీ?" చిర చిర లాడింది విమల. "అయితే మనం పిక్చర్ మానె య్యాలా?" అంది కంగారుగా.

"మరేం చేస్తాం?"

"పోనీ వాళ్ళకి చెప్పరాదూ?"

"బా .... గుం .... డ .... దే .... మో!"

"సరే, ఈ వారం ఎలాగో భరిద్దాం. ఏం చేస్తాం?" బుచ్చి బయట గదిలోకి వెళ్ళిపోయాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=586**